## బీసీ వసతి గృహాలకు వస్తువుల సరఫరాకు ఆహ్వానం

- అదనపు కలెక్టర్ అమరేందర్

నాగర్‌కర్నూల్, జనవరి 31 : జిల్లా వెనకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో కొనసాగుతున్న వసతి గృహాలు బీసీ ప్రీ మెట్రిక్, పోస్టుమెట్రిక్ వసతి గృహాలకు అవసరమైన 26 రకాల వంటపాత్రలు, ఇతర సామాగ్రిని వసతి గృహాలకు సరఫరా చేయడానికి ప్రభుత్వ గుర్తింపు పొంది ట్రేడ్ లైసెన్సు కలిగిన ఆసక్తిగల వ్యాపారస్తుల నుంచి షీల్డు టెండరు కోరడమైనదని అదనపు కలెక్టర్ అమరేందర్ శుక్రవారం ఓ ప్రకటనలో కోరారు. ఫిబ్రవరి 1వ తేదీ నుంచి ఫిబ్రవరి 6వ తేదీ వరకు ఉదయం 11నుంచి సాయంత్రం 4గంటలకు వరకు పొందవచ్చున్నారు. పూర్తిచేసిన టెండర్ ఫారాన్ని 07-02-2025 సాయంత్రం 4 గంటల్లోగా బీసీ వెల్ఫేర్ కార్యాలయంలో ఆయన ఇవ్వాలన్నారు.

## రహదారి భద్రత ప్రతిఒక్కరి బాధ్యత



ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

పెద్దకొత్తపల్లి, జనవరి 31 : రోడ్డు భద్రతావారోత్సవాల్లో భాగంగా శుక్రవారం మండల కేంద్రంలో తాసీల్దార్ కార్యాలయం నుంచి అంబేద్కర్ చౌరస్తా వరకు విద్యార్థులు, మండల ప్రజలు, పోలీసులు రోడ్డుభద్రత గురించి అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్టీవో మహేశ్, ఎస్సై సతీశ్‌కుమార్ మాట్లాడుతూ రోడ్డుభద్రతా భాగంగా విద్యార్థులు అవగాహన ర్యాలీ నిర్వహించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ట్రస్మా అధ్యక్షుడు రఘుపతిరెడ్డి, ఉన్నారు.

## స్టడీ మెటీరియల్ పంపిణీ


విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేస్తున్న దృశ్యం

అచ్చంపేట, జనవరి 31 : పట్టణంలోని సాయినగర్ జిల్లా ప్రజాపరిషత్ బాలుర పాఠశాలలో శుక్రవారం విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు. మిత్రమండలి 1985 ఎస్ఎస్‌సీ బ్యాచ్ ఆధ్వర్యంలో డాక్టర్ కే.వీ గిరిధర్ స్మారకార్థం అందజేశారు. విద్యార్థులకు పరీక్షలపై గణితంలో ఉన్న భయాన్ని పోగొట్టే విధంగా ప్రోత్సహించేందుకు సులభరీతిలో గణితం నేర్చుకునే విధంగా సూచనలు, సలహాలు, సంక్షిప్త పద్ధతులపై వివరించారు. విద్యార్థులందరూ లక్ష్యాన్ని ఏర్పాటు చేసుకొని లక్ష్యసాధనకు క్రమశిక్షణతో ప్రయత్నం చేస్తేవిజయం వరిస్తుందన్నారు. పదో తరగతిలో 10 జీపీఏ సాధించిన విద్యార్థులకు రూ.10వేల నగదు మిత్రమండలి ఆధ్వర్యంలో పారితోషికం అందించనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో మిత్రమండలి గౌరవ అధ్యక్షుడు శ్రీనివాసులు, అధ్యక్షుడు బాలాజీ, ఉపాధ్యక్షుడు శ్రీనివాసులు, రాష్ట్ర గణితఫోరం అధ్యక్షుడు శ్రీనివాసులు, హెచ్ఎం జీవన్ కుమార్, ఉపాధ్యాయురాలు మాధవి, లక్ష్మీబాయి తదితరులు పాల్గొన్నారు.

## 5న కొండనాగులలో జాబ్‌మేళా

అచ్చంపేట, జనవరి 31 : మండలంలోని కొండనాగుల ఉమామహేశ్వరి డిగ్రీ కళాశాలలో ఈనెల 5న జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ పరంగి రవి శుక్రవారం ప్రకటన లో తెలిపారు. ఫాక్స్‌కాన్ కంపెని కొంగరకలాన్ హైదరాబాద్ ఆధ్వర్యంలో జిల్లాలోని నిరుద్యోగ యువతి, యువకులు, మహిళల కు వెయ్యిమందిని ఉద్యోగ ఉపాధి కల్పించే అవకాశం ఉందని తెలిపారు. అభ్యర్థులు పదో తరగతి, ఇంటర్, ఐటీఐ, డిగ్రీ చదివిన, ఫెయిల్ అయిన సర్టిఫికేట్లు, 2 పాస్‌ఫోటోలు, బ్యాంక్ అకౌంట్ జిరాక్స్, ఆధార్‌కార్డు తీసుకొని ఉదయం 10 గంటలకు జాబ్‌మేళాకు హాజరుకావాలని కోరారు. వివరాలకు 7075055878, 9010604235 సంప్రదించాలని, జిల్లా పరిధిలోని నిరుద్యోగులు జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## మిస్సింగ్ కేసు నమోదు

బల్మూరు, జనవరి 31 : మండలంలోని మైలారం గ్రామానికి తల్లికూతురు మిస్సైన ఘటన మండలంలో శుక్రవారం చోటుచేసుకున్నది. ఎస్సై రమాదేవి వివరాలు ప్రకారం.. గురువారం రమేశ్ భార్య, కూతురు తనకూతురితో కలిసి అచ్చంపేటకు వెళ్లి ఇంటికి రాలేదు. బంధువులు, గ్రామంలో ఎంతవెతికినా అచూకీ లభించలేదన్నారు. రమేశ్ ఫిర్యాదుమేరకు కేసునమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

## యువకుడిపై పోక్సో కేసు నమోదు

చారకొండ, జనవరి 31 : మండలంలోని ఓ మైనర్ బాలికను వేధింపులకు పాల్పడటంతో యువకుడిపై పోక్సో కేసు నమోదైన ఘటన శుక్రవారం చోటు చేసుకున్నది . వెల్దండ సీఐ విష్ణువర్ధన్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం మండల కేంద్రానికి చెందిన గుండె మహేశ్ గౌడ్, అదే గ్రామానికి చెందిన ఓ మైనర్ బాలిక(16) ఇంట్లో ఎవ్వరూ లేని సమయంలో ఆమె ఇంటికి వెళ్లి తనను ప్రేమించాలని వేధింపులకు గురిచేశాడని, బాలిక తల్లి ఫిర్యాదు మేరకు పోక్సో యాక్ట్ కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

**డాక్యుమెంట్స్ పోయినవి**

ఇందుమూలంగా సమస్త ప్రజానీకానికి తెలియజేయునది ఏమనగా నా క్లాయింటు అయిన పసుల శ్రీనివాస్‌రెడ్డి తండ్రి పసుల తిరుపతి రెడ్డి, వయస్సు 62సంIIలు, వృత్తి వ్యాపారము, నివాసం ఇంటి నెం: 2-73, తిమ్మరసిపల్లి గ్రాII, కల్వకుర్తి మున్సిపాలిటీ & మంII, నాగర్‌కర్నూల్ జిల్లా, తెలంగాణ రాష్ట్రం గారిది భూమి (1) ఒరిజినల్ డాక్యుమెంట్ నెంబర్: 6072/07 రిజిస్ట్రేషన్ తేది: 29-06-2007, (2) డాక్యుమెంట్ నెంబర్: 4952 /2009 రిజిస్ట్రేషన్ తేది : 30-03-2009, 3) లింకు డాక్యుమెంట్ నెంబర్ : 2333/1990, రిజిస్ట్రేషన్ తేది:05-11-1990. 4) లింకు డాక్యుమెంట్ రిజిస్ట్రేషన్, తేది: 07/1991 ఉన్నటువంటి ఒరిజినల్ డాక్యుమెంట్ మరియు లింకు డాక్యుమెంట్ కల్వకుర్తి బస్టాండ్ నుండి తిమ్మరసిపల్లి గ్రామానికి బస్సులో వస్తుండగా మధ్యలో పోయినది. ఎవరికైనా పైన తెలిపిన ఒరిజినల్ డాక్యుమెంట్ మరియు లింకు డాక్యుమెంట్ దొరికినచో ఈ క్రింది అడ్రస్‌లో ఇవ్వగలరని మనవి.

S.VENKATESH M.A., (ILM)
Advocate, KALWAKURTHY
Cell: 9440223487

Government of Telangana :: Panchayat Raj Engineering Department
OFFICE OF THE DISTRICT PANCHAYATHRAJ ENGINEER, PIU.DIVISION, NAGARKURNOOL
Chit Short Tender Notices DB/ATO/07/2024-25, Date:31-01-2025

| Sl.No. | Mandal | Name of the work | Name of the grant | Estimated Cost (Rs. in lakhs) | Re marks |
|---|---|---|---|---|---|
| 1. | Tadoor | Construction of Compound wall and open Gym of Park of Cherlaitikyala (V) of Tadoor (M) | DMFT | 10.00 | |
| 2. | Kollapur | Construction of Drain in BC Colony at Cherlaitikyala (V) of Tadoor (M) | DMFT | 10.00 | |
| 3. | Telkapally | Repairs and Maintenance of Toilets and Bath Rooms in KGBV at Telkapally (V&M) | DMFT | 10.00 | |

Last date for receipt of application : 05-02-2025 upto 5.00PM
Issue of Tender Shedules : 05-02-2025 upto 5.00PM
The Tenders will be received 06-02-2025 upto 3.00PM
Opening of Tenders : 06-02-2025 upto 3.30PM
Cost of Tender Shedules Rs.1500/- in favour of DPRE PIU.DIVN.NGL
Cost of 1% EMD in favour of DPRE PIU.DIVN. Nagarkurnool
Further details can be obtained for Dist. Panchayath Raj Engineer PIU Division, Nagarkurnool, Nagarkurnool District.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

**CHANGE OF NAME**

I, **ZAKIYA SULTANA** W/o **MOHAMMED DASTAGIR SALMAN FARSI,** R/o H.No: 6-4-25/26, Habeeb nagar Mahabubnagar. In my old passport my spouse name is mentioned as **MOHAMMED DASTAGIR** kindly change the name as **MOHAMMED DASTAGIR SALMAN FARSI**.

**ప్రకటన**

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

To Book your Classified
4 lines Advt
Rs. 200/-
Only (B/W)
Additional Line
50/- Only
For Advertisement Enquiry
Please Contact...
9182777641
9182777654
9182777748

# గురుకులాల్లో సౌకర్యాలు మెరుగ్గా ఉండాలి

- పౌష్టికాహార ప్రమాణాలపై దృష్టి పెట్టాలి
- కలెక్టర్ బదావత్ సంతోష్


గురుకులాల ప్రత్యేకాధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న కలెక్టర్ సంతోష్

నాగర్‌కర్నూల్, జనవరి 31 : గురుకుల పాఠశాలలో సౌకర్యాలు పౌష్టికాహార ప్రమాణాలపై ప్రత్యేకదృష్టి పెట్టాలని, పరిశుభ్రమైన వాతావరణంలో భోజనం తయారు చేసే వడ్డించాలని కలెక్టర్ బదావత్ సంతోష్ సూచించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో జిల్లాలోని ఆశ్రమ పాఠశాలల ప్రత్యేకాధికారులతో క్షేత్రస్థాయిలో అమలవుతున్న కార్యక్రమాలపై అదనపు కలెక్టర్ అమరేందర్, దేవసహాయంతో కలిసి కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ప్రభుత్వ గురుకుల పాఠశాలల్లో విద్యార్థులకు పౌష్టికాహారం అందించాలన్న లక్ష్యంతో ప్రభుత్వం డైట్ చార్జీలను పెంచినట్లు తెలిపారు. ఈ పెంపును క్షేత్రస్థాయిలో అమలవుతున్న విధానాన్ని ప్రత్యేక అధికారులు అడిగి తెలుసుకున్నారు. ప్రత్యేకాధికారులు ఎప్పటికప్పుడు తనిఖీలు నిర్వహించి విద్యార్థులకు అందిస్తున్న భోజనం, ఆరోగ్యం, పరిసరాలపై క్షుణ్ణంగా పరిశీలించి నివేదికలను ఇవ్వాలని కలెక్టర్ సూచించారు. గురుకులాలకు సరఫరా అయ్యే బియ్యం, కూరగాయలు, ఆకుకూరలు, నూనె వంటి వంట సరుకుల నాణ్యతను ప్రత్యేకాధికారులు పరీక్షించి, వాటి కాలపరిమితిని జాగ్రత్తగా పరిశీలించాలన్నారు. పాడైన గుడ్లు, కూరగాయలను ఉపయోగించి విద్యార్థుల అనారోగ్యానికి కారణమైతే కఠిన చర్యలు ఉంటాయని కలెక్టర్ హెచ్చరించారు. పెంచిన రేట్లనుకు అనుగుణంగా చార్ట్‌లను డైనింగ్ హాల్‌లో ప్రదర్శించాలని ఆదేశించారు. స్పెషల్ ఆఫీసర్లు వారానికి తప్పనిసరిగా సందర్శించి తనిఖీలు, నెలకు ఒకసారి గురుకులాల్లో బస చేయాలన్నారు. ప్రత్యేకాధికారులు గురుకులాలపై ఎప్పటికప్పుడు నివేదికలు ఉన్నతాధికారులకు అందించాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే విద్యార్థులు మరింత ఉన్నతస్థాయికి చేరుకునే విధంగా అధికారులు కృషి చేయాలని కలెక్టర్ సూచించారు.

## అచ్చంపేట మున్సిపల్ కమిషనర్‌గా యాదయ్య


చైర్మన్ శ్రీనివాసులును కలిసిన కమిషనర్‌గా యాదయ్య

అచ్చంపేట రూరల్, జనవరి 31 : అచ్చంపేట మున్సిపల్ కమిషనర్‌గా యాదయ్య శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేసిన శ్యాంసుందర్ బదిలీపై హైదరబాద్ శివారులోని బడంగ్‌పేట మున్సిపల్ కమిషనర్‌గా వెళ్లగా ఆయన స్థానంలో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని కోస్గి మున్సిపల్ కమిషనర్ పనిచేస్తున్న యాదయ్య అచ్చంపేటకు బదిలీపై వచ్చారు. అనంతరం చైర్మన్ శ్రీనివాసులును కలిసి పూలమొక్కను అందజేశారు.

## ప్రజాకవి గద్దర్ జయంతి వేడుకలు


నివాళులర్పిస్తున్న సంఘాల నాయకులు

అచ్చంపేట, జనవరి 31 : పట్టణంలోని అమరవీరుల స్థూపం వద్ద శుక్రవారం ప్రజాయుద్ధనౌక, ప్రజాకవి గద్దర్ జయంతి వేడుకలు నిర్వహించారు. ప్రజాసంఘాల ఆధ్వర్యంలో గద్దర్ చిత్రపటానికి నివాళులర్పించారు. పీడితవర్గాల ప్రజల కోసం జీవితాన్ని త్యాగం చేసిన గద్దర్‌ను కొందరు రాజకీయంగా విమర్శలు చేయడం తగదని పేర్కొన్నారు. కార్యక్రమంలో పాండు, శ్రీశైలం, రవి తదితరులు పాల్గొన్నారు.

## సారాతయారీలో పట్టుబడితే చర్యలు


తాసీల్దార్ ఎదుట హాజరైన సారా తయారీదారులు

వంగూరు, జనవరి 31 : మండలంలోని సర్వారెడ్డి పల్లి తండా, తిరుమలగరితండాలతో పాటు పలు గిరిజన తండాలకు చెందిన 14మందిని సారా విక్రయిస్తూ ఎక్సైజ్ పోలీసులకు పట్టుబడ్డారు. వారిపై కేసు నమోదు చేసిన ఎక్సైజ్ పోలీసులు శుక్రవారం తాసీల్దార్ కార్యాలయంలో తాసీల్దార్ మురళీమోహన్ ఎదుట హాజరుపర్చారు. ఈ సందర్భంగా తాసీల్దార్ మరోసారి సారాతయారీ గానీ, విక్రయించే సమయంలో పట్టుబడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎక్సైజ్ పోలీసులు పరశురాం,కృష్ణవేణిలు పాల్గొన్నారు.

## ఎస్బీ ఎస్సైసేవలు మరువలేనివి

- అదనపు ఎస్పీ రామేశ్వర్



ఎస్బీ ఎస్సై శ్రీనివాస్‌రెడ్డిని సన్మానిస్తున్న దృశ్యం

నాగర్‌కర్నూల్, జనవరి 31 : జిల్లాలో ఎస్బీ ఎస్సైగా పనిచేస్తున్న శ్రీనివాస్‌రెడ్డి సేవలు మరువలేనివని అదనపు ఎస్పీ రామేశ్వర్ అన్నారు. 41 ఏండ్లు పోలీస్ వృత్తిలో పనిచేస్తూ జిల్లా కేంద్రంలో నాలుగేండ్లుగా ఎస్బీ ఎస్సైగా విధులు నిర్వర్తిస్తూ పదవీ విరమణ పొందిన శ్రీనివాస్‌రెడ్డిని శుక్రవారం వీడ్కోలు సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌రెడ్డి దంపతులను పూలమాలతో సత్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. ప్రభుత్వ ఉద్యోగికి విరమణ అనేది సహజమని, నాలుగు దశాబ్దాలపాటు పోలీస్ వృత్తిలో పనిచేసిన శ్రీనివాస్‌రెడ్డి ఇకనుంచి తన జీవితాన్ని పదవీ విరమణ కాలంలో భార్యపిల్లలతో సుఖంగా గడపాలని కోరారు. కార్యక్రమంలో డీసీఆర్‌బీసీఐ ఉపేందర్‌రావు, డీసీఆర్‌బీ ఎస్సై, ఎస్బీ సిబ్బందితోపాటు ఐటీకోర్ సిబ్బంది, సన్మానగ్రహిత కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

**ఏఆర్ పోలీస్‌ను అభినందించి ఎస్పీ :**

పరుగుల వీరుడు నాగర్‌కర్నూల్ జిల్లాకు చెందిన ఏఆర్ కానిస్టేబుల్‌ను శుక్రవారం ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్ అభినందించారు. గురువారం కరీంనగర్ వేదికగా జరిగిన తెలంగాణ పోలీస్‌స్పోర్ట్స్ మీట్‌లో 1500 మీటర్ల పరుగుపందెంలో నాగర్‌కర్నూల్ జిల్లా బల్మూర్ మండలం రామాజిపల్లి గ్రామానికి చెందిన కానిస్టేబుల్ దేశెట్టి శివ రెండు గోల్డ్ మెడల్ సాధించడం జిల్లా పోలీస్ శాఖకు గర్వకారణమన్నారు.

ముమ్ముందు మరింత ప్రతిభ చాటాలని ఎస్పీ కోరారు. ఈ సందర్భంగా ఎస్పీతోపాటు పోలీస్ అధికారులు, సిబ్బంది అభినందించారు.

## బాలస్వామి ఇంటిపై దాడిచేసిన వారిని శిక్షించాలి

అచ్చంపేట రూరల్, జనవరి 31 : మాల మహానాడు అచ్చంపేట డివిజన్ అధ్యక్షుడు బాలస్వామి ఇంటిపై దాడిచేసిన దుండగులను కఠినంగా శిక్షించాలని మాల మహానాడు జాతీయఅధ్యక్షుడు చెన్నయ్య డిమాండ్ చేవారు. శుక్రవారం పట్టణంలోని డీఎస్పీ కార్యాలయంలో డీఎస్పీ పల్లె శ్రీనివాసులును కలిసి పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు.కార్యకమంలో నాయకులు వెంకటేశ్వర్లు, సరళ, పౌలు, అనిల్, రాజేశ్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# నిద్రావస్థలో నిఘా వ్యవస్థ

- జిల్లా కేంద్రంలో పెరిగిన వాహనాల రద్దీ
- తరచుగా ప్రమాదాలు, దొంగల భయం


హౌసింగ్‌బోర్డులో నేలవైపు ఉన్న సీసీ కెమెరా



నాగనూల్ చౌరస్తాలో డబ్బా చాటున సీసీ కెమెరా

నాగర్‌కర్నూల్ రూరల్, జనవరి 31 : జిల్లాకేంద్రంగా ఏర్పాటైన నాటి నుంచి వివిధ అభివృద్ధి కార్యక్రమాలతో మార్పులు చెందుతూ పట్టణం శరవేగంగా అడుగులు వేస్తూ పయనిస్తుంది. ముఖ్యంగా జిల్లా కేంద్రం కావడంతో ప్రధాన కార్యాలయాలు దవాఖానలు, షాపింగ్‌మాల్స్ నెలకొనడంతో సమీప గ్రామాల ప్రజలు తమ అవసరాల కోసం నిత్యం జిల్లా కేంద్రానికి రాకపోకలు కొనసాగిస్తుండడంతో రోజురోజుకు వాహనాల రద్దీ పెరిగి తరచుగా ప్రమాదాలు దొంగతనాలు కూడా జరుగుతున్నాయి. రాత్రివేళల్లో ఇలాంటి ఘటనలను గుర్తించి చర్యల కోసం ప్రధాన రహదారి వెంబడి ముఖ్యచౌరస్తాల్లో యూటర్న్ ప్రాంతాల్లో ప్రమాదాలను భద్రపర్చేందుకు సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. కాగా రెండునెలల నుంచి హౌసింగ్‌బోర్డు రాఘవేంద్ర సూపర్‌మార్కెట్ ఎదుట యూటర్న్ దగ్గర సీసీ కెమెరా నేలవైపునకు చూస్తున్నాయి. ప్రతిరోజు కొల్లాపూర్ చౌరస్తాలో ఉన్న కలెక్టర్, ఎస్పీ కార్యాలయాలకు వెళ్లే అధికారులు ప్రధానంగా ట్రాఫిక్ పోలీసులు ఎవరు వీటిని గమనించకపోవడంతో చూస్తే నిర్లక్ష్యం ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు. జరగరాని ప్రమాదం, సంఘటన ఏదైనా జరిగితే తగిన మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుంది. ఇప్పటికైనా అధికారులు వెంటనే స్పందించి సీసీ కెమెరాలను రోడ్డు ప్రమాదాల నిక్షిప్తం, భద్రత కోసం సరి చేయాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

# ప్రయాణం.. ప్రమాదకరం

- అరికట్టే నాథుడే కరువు..
- కట్టడి చేయాలంటున్న ప్రజలు


జటప్రోల్‌లో పరిమితికిమించి వాహనాల్లో కూలీలను ఎక్కిస్తున్న దృశ్యం


పెంట్లవెల్లిలో పరిమితికిమించి ప్రయాణికులను తరలిస్తున్న ఆటో

పెంట్లవెల్లి, జనవరి 31 : మండలంలోని జటప్రోల్, గోప్లాపురం, శింగవరం, కొండూరు తదితర గ్రామాలతో పాటు, మండలకేంద్రం నుంచి ఈ యాసంగి కాలంలో పండించే పంటలకు అవసరమున్న కూలీలను వ్యవసాయ పనుల నిమిత్తం కూలీలకు అధికడబ్బు ఆశ చూపి తమ సమయానుకూలంగా తీసుకుపోయేందుకు వివిధ వాహనాలను వినియోగించుకుంటున్నారు. ఇందుకు తగ్గట్లు గా వాహనదారులు కూలీలను తమ ఇష్టానుసారంగా పరిమితికి మించి ఎక్కించుకొని పోతున్నారు. ఒకవైపు పోలీసులు వాహనాల తనిఖీలు నిర్వహిస్తూ.. హెచ్చరికలు జారీ చేస్తున్న అవేమీ తమకు పట్టనట్లు వాహనదారులు వ్యవహరిస్తున్నారు. పరిమితికిమించి ప్రయాణికులను ఆటోల్లో ఇరుకిరుకుగా బస్తాలను సర్దినట్లు సర్ది తమ రాజకీయ పలుకుబడిని ఉపయోగించి పోలీస్‌స్టేషన్ ఎదుటే దర్జాగా రాకపోకలు కొనసాగిస్తున్నారు. ఇలాంటి పరిస్థితిలో ఏమైన ప్రమాదం జరిగితే పరిస్థితి ఏమిటన్నది ఇటు వాహనదారులు, ప్రయాణికులు ఆలోచించక పోవడం శోచనీయం. చిన్నఆటోలో సుమారు 15 నుంచి 20 వరకు, మరి కాస్తా పెద్దఆటోలో అయితే 35నుంచి 45 వరకు మహిళా కూలీలను వాహనాల్లో తరలిస్తున్నారు. ఈ సమయంలో వాహనాలు ప్రమాదానికి గురైతే ఆ ఇంటి పరిస్థితి ఏమవుతుందో ఊహించుకుంటేనే భయమేస్తోంది. ఈ మధ్యకాలంలో జిల్లాలో కూలీలను తరలిస్తున్న వాహనాలు ప్రమాదానికి గురైన ఘటనలు ఎన్నో చోటుచేసుకున్న.. కూడా కట్టడిచేసే నాథుడే కరువయ్యారని పలువురు విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తగుచర్యలు తీసుకొని ప్రమాదాలు కాకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

### చర్యలు తీసుకుంటాం..



మండలంలోని వివిధ గ్రామాల్లో పరిమితికిమించి ప్రయాణికులను తీసుకుపోయే వాహనదారులపై పోలీస్ నిబంధనల ప్రకారం కఠినచర్యలు తీసుకుంటాం. అదే విధంగా వాహనదారులు ప్రతిఒక్కరూ కూడా ట్రాఫిక్ నిబంధనలను పాటించాలి.

- ఎస్సై రామన్‌గౌడ్, పెంట్లవెల్లి మండలం

## నులిపురుగు నిర్మూలన రోజును విజయవంతం చేయాలి

- జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్

నాగర్‌కర్నూల్ రూరల్, జనవరి 31 : ఫిబ్రవరి 10వ తారీఖున నిర్వహించే జాతీయ నులిపురుగుల నిర్మూలన రోజును విజయవంతం చేయాలని కలెక్టర్ బదావత్ సంతోష్ కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన డిస్ట్రిక్ట్ టాస్క్ ఫోర్స్ సమావేశంలో అధికారులకు సూచించారు. ఎన్ఎఫ్‌హెచ్ఎస్ సర్వే ప్రకారం పిల్లల్లో నులిపురుగుల సంక్రమణ 60శాతం ఉండేదని ఇప్పటివరకు 14 రౌండ్లు వేసిన అల్బెండజోల్ మాత్రలు వేయడం వలన ప్రస్తుతం 1-19 సంవత్సరాల వయస్సు గల పిల్లల్లో నులిపురుగుల సంక్రమణ 2019-20 సంవత్సరంలో 2.5శాతంకు తగ్గిందని కోవిడ్ తర్వాత ప్రస్తుతం నులిపురుగుల సంక్రమణ 34శాతం ఉందని తెలిపారు 15వ రౌండ్ ఫిబ్రవరి 10న అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో, అంగన్‌వాడీ కేంద్రాల్లో 2,04,685, 1-19సంవత్సరాల వయస్సు గల పిల్లలకు భోజనం చేసిన తర్వాత అల్బెండజోల్ 400ఎంజీ మాత్రలు వేయాలని ఆ రోజు గైర్హాజరైన విద్యార్థులకు ఫిబ్రవరి 17న వేయాలని తెలిపారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌వో కేవీ.స్వరాజ్యలక్ష్మి, జిల్లా ఇంటర్మీడియట్ నోడల్ ఆఫీసర్ రమణ, ప్రోగ్రామ్ అధికారి డాక్టర్ రవికుమార్, ఇతర శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## పాపన్నగౌడ్ ఆశయాలను నెరవేర్చుదాం

వెల్దండ, జనవరి 31 : గోల్కొండ కోటపై బడుగుల జెండా ఎగురవేసిన దీరుడు సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ ఆశయాలను నెరవేర్చేందుకు గౌడ యువత నడుం బిగించాలని గౌడసంఘం రాష్ట్ర నాయకుడు శ్రీనివాస్‌గౌడ్ , తాలూకా అధ్యక్షుడు అల్లాజిగౌడ్, మండల అధ్యక్షుడు వెంకటయ్యగౌడ్ అన్నారు. శుక్రవారం మండల గౌడ సంక్షేమ సంఘం 2025 క్యాలెండర్‌ను రంగారెడ్డి, ఆమనగల్లు పట్టణం కంఠమహేశ్వరస్వామి ఆలయంలో అవిష్కరించారు. అంతకుముందు మండలకేంద్రంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో మండల వర్కింగ్ ప్రెసిడెంట్ నాగరాజుగౌడ్, నిరంజన్‌గౌడ్, ఎంఎస్‌గౌడ్, రఘుగౌడ్, రవిగౌడ్, రాజశేఖర్‌గౌడ్, అల్లాజిగౌడ్, మల్లేశ్‌గౌడ్, రాంచందర్‌గౌడ్, శివగౌడ్, శివరాజ్‌గౌడ్, రమేశ్‌గౌడ్, రాజుగౌడ్, పర్వతాలుగౌడ్, భీమయ్యగౌడ్ తదితరులు ఉన్నారు.

## మోసం చేసిన కాంగ్రెస్ ప్రభుత్వం

వంగూరు, జనవరి 31 : రైతులను నమ్మించి కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేసిందని బీఆర్ఎస్ మండల నాయకులు సైదులు శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఎన్నికల ముందు ఏడాదికి ఎకరాకు రూ.15వేల రైతుభరోసా ఇస్తానని బూటకపు హామిలిచ్చిన కాంగ్రెస్ దాన్ని రూ.12వేలకు కుదించిందన్నారు. జనవరి 26న అందరికీ రైతు భరోసాను అందిస్తామని ఉదరగొట్టిన ప్రభుత్వ పెద్దలు కేవలం మండలంలో ఓ చిన్న గ్రామాన్ని తీసుకుని వారికి మాత్రమే అందివ్వడం సరికాదన్నారు. రైతులు ఎంతోకష్టంలో వుంటే వారికి అండగా ఉండాల్సిన ప్రభుత్వం వారితో ఆటలు ఆడుకుంటూ వారి గోసను చూస్తుందని మండిపడ్డారు. గతంలో రైతుబీమాతో మృతి చెందిన రైతు కుటుంబాలకు కొంతఊరట నిచ్చేదన్నారు. నేడు రైతుబీమా జాడ లేకపోవడం బాధాకరమన్నారు. రైతులను విస్మరించిన ఏ ప్రభుత్వం మనుగడ సాధించలేదని త్వరలో కాంగ్రెస్ గుర్తించుకోవడం ఖాయమన్నారు.

## పాఠశాలను తనిఖీ చేసిన ఎంఈవో

బిజినేపల్లి, జనవరి 31 : మండలంలోని కారుకొండ గ్రామంలో గల ప్రాథమిక పాఠశాలను శుక్రవారం ఇన్‌చార్జి ఎంఈవో రఘునందన్‌శర్మ ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలో మధ్యాహ్న భోజనం విద్యార్థుల రిజిస్టర్లు తదితర రికార్డులను పరిశీలించారు. విద్యార్థులకు సంబంధించిన ఆపార్ ఐడీ నెంబర్లను విద్యార్థులందరికీ జనరేట్ చేయాల్సిందిగా సూచించారు. అనంతరం తరగతుల వారీగా విద్యార్థుల సామర్థ్యాన్ని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో హెచ్.ఎం రామకృష్ణ, ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉన్నారు.

## టీఎన్జీవో టేబుల్ క్యాలెండర్ ఆవిష్కరణ


టీఎన్జీవో టేబుల్ క్యాలెండర్‌ను ఆవిష్కరణ చేస్తున్న ఆర్డీవో

కొల్లాపూర్, జనవరి 31 : కొల్లాపూర్ డివిజన్ టీఎన్జీవో టేబుల్ క్యాలెండర్‌ను శుక్రవారం ఆర్డీవో బన్సీలాల్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ.. ఉద్యోగ విధి నిర్వహణలో మంచి పేరు తెచ్చుకోవాలన్నారు. కార్యక్రమంలో డివిజన్ టీఎన్జీవో అధ్యక్షుడు వెంకటేశ్, కార్యదర్శి సురేందర్, కోశాధికారి నాగరాజు పాల్గొన్నారు.

## రైతుకు నష్టపరిహారం అందజేత

అచ్చంపేట రూరల్, జనవరి 31 : మండలంలోని గుంపన్‌పల్లికి చెందిన కేతావత్ లక్ష్మణ్‌కు చెందిన ఆవుదూడపై అడవిలో గతంలో చిరుత దాడిచేసి చంపగా అటవీశాఖ నుంచి సదురు రైతుకు నష్టపరిహారం రూ 15వేలు చెక్కు రూపంలో అందజేసినట్లు ఎఫ్ఆర్‌వో సుబుర్ తెలిపారు. వన్యప్రాణుల దాడిలో మృతి చెందిన పశువుల యాజమానులకు శాఖ తరపున ఆదుకుంటామన్నారు. కార్యక్రమంలో ఎఫ్ఆర్‌వో బాలకిష్టయ్య, ఎఫ్‌బీవో రవి పాల్గొన్నారు.

## ఎర్రగట్టు బొల్లారం వాసులకు ఇళ్లపట్టాలు ఇవ్వాలి


గిరిజనులతో సంఘం నాయకులు

కొల్లాపూర్ రూరల్, జనవరి 31 : మండలంలోని బోడబండ గ్రామంలోని ఎర్రగట్టు బొల్లారంలో తెలంగాణ గిరిజన సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం నాడు గ్రామాన్ని సందర్శించారు. గ్రామంలో వివిధ సమస్యలను గ్రామస్తులతో అడిగి తెలుసుకున్నారు. సంఘం జిల్లాఅధ్యక్షుడు అశోక్ మాట్లాడుతూ.. మంత్రి జూపల్లికృష్ణారావు ప్రాతినిధ్యం వహిస్తున్న బొల్లారంలో సంక్షేమ పథకాలు వైద్యసౌకర్యాలు కాని అంగన్‌వాడీ సెంటర్, మంచినీటి సదుపాయం, రోడ్డుసౌకర్యం లేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామ సమస్యలపై మంత్రి జూపల్లి స్పందించాలని లేని యెడల ప్రజలతో కలిసి తాసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తామని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో భగవాన్ దాసు, ప్రభాకర్, విజయ్ సంఘం నాయకులు తదితరులు ఉన్నారు.

## వేసవిలో నీటి ఎద్దడి లేకుండా చూడాలి

నాగర్‌కర్నూల్ రూరల్, జనవరి 31 : రాబోయే ఎండకాలంలో నీటి సమస్యలు తలెత్తకుండా మిషన్ భగీరథ నీళ్లను గ్రామాలల్లో ప్రతి ఇంటికి చేరేలా ఇప్పటి నుంచే చర్యలు చేపట్టాలని మండల పరిషత్ అధ్యక్షుడు ఎస్.నరసింహారెడ్డి అన్నారు. శుక్రవారం నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశానికి ఎంపీపీ అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ రమణారావు హాజరయ్యారు. నూతనంగా ఎంపికైన వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ రమణరావును ఎంపీపీ, ఎంపీడీవో శాలువాతో సన్మానం చేశారు.

**పంటను గుర్తించాకే నమోదు చేయాలి**

రైతులు సాగు చేస్తున్న పంటను పొలాల దగ్గరికి వెళ్లి వివరాలను నమోదు చేయాలని, కొంతమంది వ్యవసాయ అధికారులు కూర్చొన్న దగ్గరే పంట నమోదు కార్యక్రమం చేస్తున్నట్లు తన దృష్టికి వచ్చిందని అలా చేయడంతో రైతులు నష్టపోయే అవకాశాలు ఉన్నాయన్నారు.